క్లుప్తంగా

గణపతి ఆలయాల్లో పూజలు

నందిగామ: సంకటహర చతుర్థి నేపథ్యంలో మంగళవారం గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణంలోని పాత బస్టాండ్, కాకులయ్య వీధిలో గణపతి ఆలయాలలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో విగ్నేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

నవాబుపేట (పెనుగంచిప్రోలు): మండలంలోని నవాబుపేట గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా స్నేహ సమాజం సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు సంబరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎల్ రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల స్థాయిలో షటిల్ టోర్నమెంట్, గ్రామ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్, స్టార్ మహిళ, చిన్నారులకు సామూహిక భోగిపళ్లు, స్లోసైకిలింగ్, స్లోబైకింగ్, జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల స్థాయిలో ముగ్గుల పోటీలు, తెలుగమ్మాయి, తెలుగబ్బాయి, మ్యాజిక్ షో పోటీలు నిర్వహిస్తామన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం



నందిగామ (చందర్లపాడు): ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారిపారేపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని కోనాయపాలెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పారేపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఒక్కొక్కసారి అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడేందుకు ప్రథమ చికిత్స ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు ప్రథమ చికిత్సపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రథమ చికిత్స విధానం తెలిస్తే ఎంతటి ప్రమాదాన్నయినా అధిగమించవచ్చని పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు



లింగాల (వత్సవాయి): మండల కేంద్రం వత్సవాయితో పాటు దబ్బాకుపల్లి గ్రామాలకు రక్షిత మంచినీరు సరఫరా పైపులైన్ మరమ్మతు పనులు నిర్వహించారు. రెండు రోజుల నుంచి లింగాల వద్ద కాజ్‌వే పైన పైపు పగిలిపోవడంతో నీరు వృథాగాపోతోంది. ఇది గమనించిన స్థానికులు రెండు గ్రామాల సర్పంచులకు తెలపగా వెంటనే వారు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి పైపులైన్ మరమ్మతుల పనులను చేపట్టారు. పగిలిన పైపును సరిచేసి నీరు వృథాగా పోకుండా నిలిపివేశారు. వత్సవాయి, దబ్బాకుపల్లి సర్పంచులు భూక్యా సీతమ్మ, కొట్టె నగేష్, వత్సవాయి పంచాయతీ ఈవో షేక్ ఇమామ్‌సాహెబ్, భూక్యా రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కంచికచర్ల: స్థానిక సచివాలయం-1 పరిధిలోని ఆరో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం బుధవారం ఉదయం 8 గంటల నుంచి జరుగుతుందని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ వేమా సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తారన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వేమా పిలుపునిచ్చారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

వీరులపాడు: వీఆర్వోలు ఆయా గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ విక్టర్ బాబు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు రెవెన్యూ రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని వీఆర్వోలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు
- కంచికచర్ల 6వ వార్డుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



కంచికచర్లలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

కంచికచర్ల: అన్ని వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చెప్పారు. కంచికచర్ల 6 వార్డుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఐదోరోజు మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగితెలుసుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, ఆర్బీకే సెంటర్లు, మన బడి నాడు నేడు, లక్షల సంఖ్యలో ఇళ్ల పట్టాల పంపిణీ, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం, జగనన్న మోడల్ కాలనీలు, అమ్మ ఒడి, విద్యా దీవెన, ఉన్నత కులాల్లోని నిరుపేదలకు ఆర్థిక సాయం అందించడం, ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ... సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీసభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల మధుబాబు, నాయకులు దేవరపల్లి గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, వంగా శ్రీనివాసరావు, ఎం పాండు, గ్రంధి వెంకటేశ్వరరావు, మాగుడుల శంకర్, శేషం వాసుబాబు, అమర్లపూడి యోహాన్, తంగిరాల సృజినీకుమార్, వేల్పుల రమేష్, వేల్పుల శ్రీనివాస్, మార్త శ్రీనివాస్ ఎంపీడీఓ కే బాలశంకర రావు, ఆర్‌ఐ శిరీష, ఏపీఎం కోట భాస్కరరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మించాలని ఆదేశం

కంచికచర్ల పాత శివాలయం రోడ్డులో మురుగు నీరు పారుదల కాకపోవటంతో ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పాత డ్రెయినేజీని పరిశీలించారు. ప్రస్తుతమున్న డ్రెయినేజీ ద్వారా ఇళ్లల్లో మురుగునీరు పారుదల కాక శివాలయం చుట్టూ నిల్వ ఉండటంతో స్థానికుల ఇబ్బందులు చెప్పారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిలక్ష్మిని పిలిచి కొత్త డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టేందుకు అంచనా వేయాలని ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు అధికారులను ఆదేశించారు.

పేదల కళ్లలో సంతోషం నింపేలా సీఎం పాలన

నందిగామ టౌన్: నిరుపేదల కళ్లలో సంతోషం నింపేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని రాఘవాపురం గ్రామంలో మంగళవారం రాత్రి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి పథకాల క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ఒక సామాజిక వర్గానికే కొమ్ము కాయకుండా అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని విమర్శలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని రానున్న ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీదే విజయమని ఆయన చెప్పారు. సర్పంచ్ పెసరమల్లి సురేష్, ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నెలకుదిటి శివనాగేశ్వరరావు, నాయకులు స్టాలిన్, చంద్రశేఖర్, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వాహన చోదకులు భద్రతపై దృష్టి పెట్టాలి

ఏసీపీ నాగేశ్వర్ రెడ్డి



వాహన చోదకులకు పూలు అందజేసి జాగ్రత్తలు చెబుతున్న ఏసీపీ

నందిగామ: వాహన చోదకులు వ్యక్తిగత భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏసీపీ నాగేశ్వర్ రెడ్డి సూచించారు. పట్టణ శివారులో 65వ నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం వాహన చోదకులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి పువ్వులు అందజేసి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాహనం నడుపుతున్న ప్రతి ఒక్కరూ అవసరమైన జాగ్రత్తలు పాటిస్తూ వాహనాన్ని నడపాలన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. బయటికి వచ్చిన వారి కోసం వారి కుటుంబ సభ్యులు ఎంతో ఆశగా ఎదురు చూస్తూ ఉంటారని..ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ హెచ్ ఓ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



కంచికచర్లలో భోగిమంటలు వేసి పాటలు పాడుతున్న విద్యార్థులు



గ్లోబల్ స్కూల్‌లో సంక్రాంతి వేడుకల్లో చిన్నారులు

జగ్గయ్యపేట అర్బన్: ముందస్తు సంక్రాంతి పండుగ సంబరాలు పట్టణంలో పలు పాఠశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సంక్రాంతి పండుగ ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు వివరించి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక వాగ్దేవి మహిళా కళాశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను కరస్పాండెంట్ సరిత అందజేశారు. మన సంప్రదాయాలు, వ్యవసాయం, సంస్కృతి తదితర విషయాలను విద్యార్థులకు అవగాహన కలిగించే కార్యక్రమాలను ప్రిన్సిపాల్ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వేడుకల్లో చిన్నారులు..

పట్టణంలోని శ్రీవివాన్ గ్లోబల్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో చిన్నారులు ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు. తెలుగుతనం ప్రతిబింబించేలా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



కళాశాలలో ముగ్గుల పోటీల్లో విద్యార్థులు, కరస్పాండెంట్ సరిత, ఉపాధ్యాయులు

విద్యార్థులు ఏర్పాటు చేసిన సంక్రాంతి గొబ్బెమ్మలు, రంగవల్లులతో పాఠశాల ఆవరణ పండుగ వాతావరణాన్ని తలపించింది. బొమ్మలకొలువు పులువురిని ఎంతగానో ఆకట్టుకుంది. భోగి పళ్లతో నింపిన కుండలను చిన్నారులకు ఇచ్చి ప్రిన్సిపాల్ కీర్తి, ఉపాధ్యాయులు ఆశీర్వాదించారు.

కంచికచర్ల: స్థానిక ఉషోదయ స్కూల్‌లో ముందస్తు భోగి, సంక్రాంతి పండుగను మంగళవారం విద్యార్థులు జరుపుకున్నారు. పాఠశాలలో రంగవల్లులు వేసి, విద్యార్థులు కోలాటం వేశారు. భోగిపళ్లు, పశువుల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం భోగిమంటలు వేసి, సంక్రాంతి పాటలు పాడారు. కరస్పాండెంట్ కుర్రా కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్కూల్‌లో సంక్రాంతి వేడుకల్లో ఉల్లాసంగా చిన్నారులు

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

కమిషనర్ డాక్టర్ జయరాం

నందిగామ: పారిశుద్ధ్య సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ డాక్టర్ జయరాం హెచ్చరించారు. పట్టణ పరిధిలోని 14వ వార్డు పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆ సమయంలో వార్డు పరిధిలోని ఓ రహదారి వెంట రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి ఉండడాన్ని గమనించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుద్ధ్య సిబ్బంది సంబంధిత వార్డు ల పరిధిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. రహదారుల వెంట పిచ్చి మొక్కలు పెరగకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. బహుళ అంతస్తుల భవనాల్లో నివాసం ఉండేవారు వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బంది వచ్చినప్పుడు అందజేయాలన్నారు. అలా కాకుండా ఎక్కడపడితే అక్కడ నిర్లక్ష్యంగా పడవేయవద్దని సూచించారు. పట్టణ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు. అందులో భాగంగానే అన్ని వార్డుల పరిధిలో పూర్తి స్థాయిలో దోమల నిర్మూలనకు అవసరమైన మందులను పిచికారి చేస్తున్నామన్నారు. ఆయన వెంట సచివాలయ, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

ఉత్సాహంగా పాలిఫెస్ట్ వేడుకలు

కంచికచర్ల: పరిటాల ముత్తవరపు వెంకటేశ్వరరావు ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం పాలిఫెస్ట్ వేడుకలు నిర్వహించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు సినిమా పాటలకు విద్యార్థులు డ్యాన్స్ చేశారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి ఏ.రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యూ.ఏడుకొండలు, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ రామకృష్ణ ప్రిన్సిపాల్స్ ఏడుకొండలు, సుధాకర్

ఎర్రకాలువలో గుర్రపుడెక్క తొలగింపు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ నడిబొడ్డు నుంచి ప్రవహిస్తున్న ఎర్ర కాలువలో గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆదేశాలతో, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సూచనల మేరకు జరుగుతున్న పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులను మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ఎర్రకాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క కారణంగా మురుగు ప్రవాహం నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జేసీబీ, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది సహాయంతో గుర్రపుడెక్క తొలగించే పనులు చేపట్టామన్నారు. మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు, కౌన్సిలర్ పందుల రోశయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, అధికారులు

వర్సిటీ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

జగ్గయ్యపేట అర్బన్: కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాలల వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీల్లో పలు కళాశాలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభ కనపరిచి మెడల్స్ సాధించారు. స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ (ఎస్‌జీఎస్) కళాశాలకు చెందిన విద్యార్థులు ఎం.తిరుపతమ్మ, వై.సుదర్శన్, కె.రామకృష్ణ గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈనెల 9, 10 తేదీల్లో ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో డిగ్రీ విద్యార్థి ఎం.తిరుపతమ్మ వెయిట్ లిఫ్టింగ్‌లో 59 కేజీల విభాగంలో సిల్వర్, పవర్ లిఫ్టింగ్‌లో 57 కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించి స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్ సాధించింది. డిగ్రీ విద్యార్థి ఎం.సుదర్శన్ వెయిట్ లిఫ్టింగ్ 72 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్, డిగ్రీ విద్యార్థి కె.రామకృష్ణ బాడీ బిల్డింగ్ 65 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడని పీడీ జి.రవి తెలిపారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.



ఎస్‌జీఎస్ కళాశాలలో విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

విశ్వభారతి డిగ్రీ కళాశాలలో..

స్థానిక జేఆర్సీ-విశ్వభారతి డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ ప్రథమ సంవత్సరం విద్యార్థి గంటా సింధు పవర్ లిఫ్టింగ్‌లో 55 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం, వెయిట్ లిఫ్టింగ్‌లో ద్వితీయ స్థానం, గంటా సంధ్యశ్రీ 47 కేజీల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్‌లో ద్వితీయ, పవర్ లిఫ్టింగ్‌లో తృతీయ స్థానం కైవసం చేసుకుంది.

వీరిని కళాశాల చైర్మన్ రంగాపురం నరసింహారావు, సెక్రటరీ, కరస్పాండెంట్ పెనుగొండ వెంకట రాజీవ్, ప్రిన్సిపాల్స్ జె.అబ్బులు, కేఎస్.రమేష్, విశ్వభారతి డైరెక్టర్లు జె.తిరుపతిరావు, వి.నారాయణరావు, పీఈటీ గంటా వెంకటేశ్వర్లు అభినందించారు.



విశ్వభారతి కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలి

జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్

జూపూడి(ఇబ్రహీంపట్నం): గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ అన్నారు. జూపూడి గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు అటెండెన్స్ రిజిష్టర్ పరిశీలించారు. లబ్ధిదారుల వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఎంపీపీ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం అందించాలని సూచించారు. అంగన్‌వాడీలో బాలింతలు గర్భిణులు, చిన్నారుల పౌష్టికాహారం పంపిణీ పరిశీలించారు. ఎంపీడీవో రామకృష్ణనాయక్, తహసీల్దార్ సూర్యారావు, కార్యదర్శి మునేశ్వరరావు పాల్గొన్నారు.



జూపూడి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ పక్కన ఎంపీడీవో రామకృష్ణ

కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు

మైలవరం:కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్. సుధాకర్ తెలిపారు. సీఐటీయూ 17వ ఆలిండియా మహాసభలు బెంగళూరులో జరుగుతున్న సందర్భంగా సంఘం జెండాను మంగళవారం ఆవిష్కరించారు. లేబర్ కోడ్స్ వల్ల కార్పొరేట్‌లకు అనుకూలంగా బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక కోడ్స్‌ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొన్ని రోజులుగా జరుగుతున్న పోరాటంలో కార్మికులు వీరోచితంగా పోరాడుతున్నారన్నారు. సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు వి. శ్రీనివాసరావు, పి.జ్యోతి, పి.శైలజ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఝాన్సీ, రమాదేవి, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలకు తరలిరండి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం):బెంగళూరులో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న సీఐటీయూ 17వ ఆలిండియా మహాసభలకు కార్మికులు తరలి రావాలని ఎన్టీఆర్ జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొండపల్లి ఐడీఏలో మంగళవారం సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. నర్సింగరావు, మండల కార్యదర్శి ఎం.మహేష్, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

రెడ్డిగూడెం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండలశాఖ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. యూ టీఎఫ్ మండలశాఖ నూతన అధ్యక్షుడిగా పిల్లి సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా మిక్కిలి బాలకోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. నియామక పత్రాన్ని యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షురాలు, ఎన్నికల అధికారి డి. అపర్ణ అందజేశారు. ఉపాధ్యక్షుడిగా కట్టా రవిబాబు, ఎస్ఎస్ సుజాత, కోశాధికారిగా మల్లాది తిరుపతిరావు, కార్యదర్శులుగా ఎ.వేణుబాబు, ఎ.బిక్షాలు, జి.రవినాథ్, జి. ప్రసాదరెడ్డి, కట్టా విజయ్ కుమార్, ఆడిటర్‌గా చింతిరాల లక్ష్మయ్య ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు పటాపంచల భవాని, బీసీహెచ్‌వీ సూర్యనారాయణ,ఉమ్మడి కృష్ణాపూర్వ గౌరవ అధ్యక్షుడు డి. శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళవారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్‌హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే ప్రత్యేక సమావేశంలో ప్రత్యేక పరిజ్ఞానం, అనుభవం కేటగిరి నుంచి కో ఆప్షన్ సభ్యుని ఎన్నిక నిమిత్తం కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం ఎజెండా సిద్ధం చేసినట్లు తెలిపారు. గౌరవ కౌన్సిల్ సభ్యులు, గౌరవ ఎక్స్-అఫిషియో మెంబర్లు హాజరు కావాలని కోరారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



తిరువూరు: రాజుపేటలోని ఓ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 50 క్వింటాళ్ల బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పీడీఎస్ డెప్యూటీ తహసీల్దార్ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం... రైస్‌మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించామని తెలిపారు. ఇందుకు బాధ్యులైన హరికృష్ణ, రాజు అనే వ్యక్తులపై కేసు నమోదు చేశామని చెప్పారు. 6-ఏ సెక్షన్ కింద కేసు నమోదుచేసినట్లు పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఎ.కొండూరు:సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని చీమలపాడు, గోపాలపురం, మాధవరం గ్రామాల్లో మంగళవారం గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే తమకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఐ ఆర్.అంకారావు, ఆర్‌ఐ స్రవంతి, జెడ్పీటీసీ భూక్య గనియా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పలువురు పాల్గొన్నారు.